క్లుప్తంగా

మున్సిపల్ చైర్‌పర్సన్‌కు అభినందనలు



చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మిని సత్కరిస్తున్న పీలా వెంకటలక్ష్మి, షేక్ ఉన్నీసా బేగం

నర్సీపట్నం : ఇటీవల నర్సీపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన బోడపాటి సుబ్బలక్ష్మిని వైఎస్సార్‌సీపీ జోనల్ చైర్‌పర్సన్ పీలా వెంకటలక్ష్మి మర్యాద పూర్వకంగా గురువారం చైర్‌పర్సన్ నివాసంలో కలిసారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మిని గజమాలతో వెంకటలక్ష్మి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ఉన్నీసా బేగం ఉన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



రావాలమ్మకు నగదు అందిస్తున్న ఉప సర్పంచ్ ముత్యాలనాయుడు

కె.కోటపాడు : కింతాడ గ్రామ శివారు గొంపవానిపాలేనికి చెందిన పైల రాజేష్ (28) అనారోగ్యంతో ఈనెల 7న మరణించాడు. సహజ మరణం పొందిన రాజేష్ వైఎస్సార్ బీమా కలిగి ఉన్నారు. దీంతో అతని కుటుంబ సభ్యులకు రూ. లక్ష బీమా నగదులో భాగంగా తక్షణ సహాయం కింద గురువారం మృతుడు రాజేష్ తల్లి రావాలమ్మకు రూ.10 వేల నగదును ఉప సర్పంచ్, గ్రామ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బండారు ముత్యాలనాయుడు చేతుల మీదుగా అందించారు. మిగిలిన మొత్తం బ్యాంక్ ఖాతాలో జమ కానున్నట్లు సచివాలయ కార్యదర్శి అనురాధ తెలిపారు. వెల్ఫేర్ అసిస్టెంట్ లావణ్య, వలంటీర్లు పాల్గొన్నారు.

రైతుకూలీ సంఘం గోడపత్రిక ఆవిష్కరణ

చోడవరం రూరల్: రైతు కూలీ సంఘం జిల్లా సభలకు తరలి రావాలని ఏపీ రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన తాతారావు పిలుపునిచ్చారు. ఈనెల 18న అనకాపల్లి జిల్లా కేంద్రంలో జరగనున్న రైతు కూలీ సంఘం మహాసభల గోడపత్రికను గురువారం స్థానిక అంబేడ్కర్ భవన్ వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సింహాద్రి ఝాన్సీ ప్రధాన వక్తగా, రాష్ట్ర సహాయ కార్యదర్శి దంతులూరి వర్మ, కార్మిక నగారా పక్ష పత్రిక ఎడిటర్ ఆడారి అప్పారావు, వివిధ ప్రజాసంఘాల నాయకులు ముఖ్య వక్తలుగా పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీసభ్యులు పైలా రమేష్, కెంబూరి కల్పన, రెడ్డి లక్ష్మి, అయితిరెడ్డి అప్పలనాయుడు,ఏ.శ్రీను లు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మాడుగుల : స్థానిక బొడ్డేటివారి కళ్లాల వద్ద గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశు విజ్ఞాన బడి, రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రాయితీలతో పాటు వైఎస్సార్ పశు బీమా, 75 శాతం రాయితీతో అందిస్తున్న కాకి జొన్న విత్తనాలు, లింగనిర్ధారిత వీర్యం, ఉచిత గర్భధారణ, ఇంజక్షన్ల పంపిణీ గురించి రైతులకు ప్రాంతీయ పశు వైద్యశాల ఏడీ వి.చిట్టినాయుడు వివరించారు. అనంతరం 32 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స చేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యశాఖ సిబ్బంది, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం



అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

రావికమతం: కొత్తకోట శ్రీదుర్గాదేవి ఆలయ 13వ వార్షికోత్సవాలు గురువారం ప్రారంభం అయ్యాయి. గురువారం ఉదయం అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగించారు. అనంతరం ఆలయం వద్ద మహా చండీ యాగం నిర్వహించారు. 16న 108 లీటర్లతో అమ్మవారికి మహా క్షీరాభిషేకం, వివిధ పుష్పాలతో అర్చన నిర్వహిస్తామని, 18న మహా అన్నసమారాధన కార్యక్రమం జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకుడు వేపా రామకృష్ణ కిషోర్ తెలిపారు.

సంక్షేమంలో ముందున్న రాష్ట్రం

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



చింతలూరులో మహిళతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

మాడుగుల రూరల్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జి. అగ్రహారం సచివాలయ పరిధిలో గల చింతలూరులో గురువారం సంక్షేమ పథకాల అమలు గురించి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రజలను ఆరా తీశారు. సంక్షేమంలో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందన్నారు. గ్రామానికి విచ్చేసిన ముత్యాలనాయుడుకు కోలాట నృత్యాలతో మహిళలు స్వాగతం పలికారు. అనంతరం ఆంజనేయ స్వామిని ఆయన దర్శించుకున్నారు. గ్రామంలో ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు సమస్య గుర్తించి, వాటిని త్వరితగతిన మార్పు చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. పుట్టుకతో మూగ, చెవిటి అయిన ఐదేళ్ల బాలుడు ఇల్లపు మధుమోహన్‌కు రూ. 2 వేల నగదు అందజేశారు. రూ. 70 లక్షలతో ఇంటింటి కుళాయి కనెక్షన్లకు చింతలూరు గ్రామానికి నిధులు మంజూరు అయ్యాయన్నారు. గదబూరు గ్రామానికి రూ. 10.50 లక్షల రుపాయలు మంజూరు కాగా, 40 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కుమ్మరి ధనలక్ష్మి అనే 9 సంవత్సరాల బాలిక గొంతులో కణితి వల్ల మాట్లాడలేకపోతుందని తెలుసుకుని ఈఎన్‌టీ వైద్యునితో ఫోన్‌లో మాట్లాడి అవసరమైతే శస్త్ర చికిత్స ద్వారా మెరుగైన వైద్య సేవలందిస్తామని కుటుంబానికి హామీ ఇచ్చారు. పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు. స్థానిక ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, జెడ్పీటీసీ సభ్యురాలు కిముడు రమణమ్మ, సర్పంచ్ కాళింగ శకుంతల, మాజీ సర్పంచ్ కాళింగ కళ్యాణరాజు, ఎంపీటీసీ సభ్యురాలు ఆర్లె మాధవి, నాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ శానాపతి కొండలరావు, కాళింగ పెదబాబు, మండల సచివాలయాల కన్వీనర్ బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు గొల్లవిల్లి రాజేశ్, పడాల అప్పలనాయుడు, సయ్యపురెడ్డి నారాయణరావు, కోరుకొండ చెల్లంనాయుడు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ ఫలితాల్లో సత్తా

రోలుగుంట: స్థానిక జూనియర్ కళాశాల ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల సాధనలో కూడా అనకాపల్లి జిల్లాలో మరొకసారి ప్రథమ స్థానం దక్కించుకుంది. ఫస్ట్ ఇయర్ అన్ని గ్రూపుల నుంచి 131 మంది పరీక్షలు రాయగా 105 మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే ద్వితీయలో అన్ని గ్రూపుల నుంచి 132 మంది పరీక్షలు రాయగా 119 మంది ఉత్తీర్ణత చెందినట్లు ప్రిన్సిపాల్ సహదేవుడు గురువారం విలేకరులకు తెలిపారు.

ఫస్ట్ ఎంపీసీ నుంచి ఎం.రవీంద్ర 470 మార్కులకు గాను 461 మార్కులు తెచ్చుకుని 98 శాతం, బైపీసీ నుంచి కె.వి.లక్ష్మి 440 కి గాను 399 మార్కులు సాధించి 95 శాతం తెచ్చుకోగా సీఈసీ నుంచి కె.హేమలత 500కి గాను 427 మార్కులు తెచ్చుకుని 85 శాతం, హెచ్ఈసీ నుంచి పి.యామిని 500కి గాను 422 మార్కులు తెచ్చుకుని 84 శాతం వచ్చిందన్నారు.

కిశోర బాలికలు రక్తహీనతకు గురి కారాదు



కిశోర బాలికను పరీక్షిస్తున్న వైద్యాధికారిణి తరణి

కె.కోటపాడు : కిశోర బాలికలు వయసుకు తగ్గ బరువుతో పాటు రక్తహీనతకు గురి కాకూడదని వైద్యాధికారిణి తరణి అన్నారు. గుల్లేపల్లి గ్రామంలో గురువారం 119 మందికి ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలను ఆమె అందించారు. కిశోర బాలికలు పప్పు దినుసులు, ఆకుకూరలతో కూడిన ఆహారం తీసుకోవాలని వివరించారు. రక్తహీనత సమస్య ఉన్న కిశోర బాలికలకు ఐరన్ మాత్రలు, సిరప్‌లు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ డీఏస్ఎస్ రాజు, హెచ్‌వీ సన్యాసమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ పావని తదితరులు పాల్గొన్నారు.

రాయిపాలెంలో..

మాడుగుల రూరల్: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా శంకరం పంచాయతీ శివారు గిరిజన గ్రామమైన రాయిపాలెంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో కె.జె.పురం సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లీలాప్రసాదు, జిల్లా మలేరియా అధికారి దొర పాల్గొన్నారు. 82 మందికి వైద్య సేవలు అందించగా 9 మంది జ్వర పీడితులును గుర్తించారు. మలేరియా వ్యాధి నివారణపై జిల్లా మలేరియా అధికారి దొర ప్రజలకు అవగాహన కల్పించారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఎస్.వి.రమణ, ఎంపీహెచ్‌ఈవో పి. రవికుమార్, ఆశ, ఆరోగ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల ఉన్నతే సీఎం జగన్ లక్ష్యం



విద్యార్థులకు జేవీకే కిట్లు అందిస్తున్న సర్పంచ్ కాంతమ్మ

రోలుగుంట: పేద విద్యార్థుల ఉన్నతికి పాటు పడుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కొవ్వూరు సర్పంచ్ యర్రంశెట్టి కాంతమ్మ అన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న జగనన్న విద్యా కానుకలను గురువారం విద్యార్థులకు ఆమె అందజేశారు. కొవ్వూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం దేముడుబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వై.రాజారావు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు

ముకుందపురంలో..

మాడుగుల రూరల్: మండలంలో ముకుందపురం ఎంపీపీ పాఠశాలల్లో గురువారం విద్యార్థులకు జగనన్న విద్యా కిట్లు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం సత్తిబాబు సారధ్యంలో స్కూలు కమిటీ చైర్మన్ టి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కిట్లు అందజేసారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్దినీ, విద్యార్థులు తల్లి తండ్రులు పాల్గొన్నారు.

ఎ.కొత్తపల్లిలో..

దేవరాపల్లి : ఎ. కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వై. స్వర్ణలత అధ్యక్షతన విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు గురువారం అందజేశారు. సర్పంచ్ చింతల సత్యవెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు



వేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి సతీమణి రమణమ్మ

దేవరాపల్లి: మారేపల్లిలోని పాండవుల మెట్టపై ఇటీవల పునఃప్రతిష్ఠించిన శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ కవిత అగ్రో ఫారమ్స్ అధినేత డీవీ అప్పారావు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలం నాయుడు, సీనియర్ నాయకుడు అవుగడ్డ రామ్మూర్తినాయుడు, మారేపల్లి సర్పంచ్ అవుగడ్డ కన్నతల్లి, ఎంపీటీసీ అవుగడ్డ రామదేవి, జేసీఎస్ మండల కన్వీనర్ కేవీ రమణ తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సమకూరిన వసతి



విద్యార్థిని చేత కళాశాలను ప్రారంభింపజేస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

మాడుగుల రూరల్: వసతి సమస్యతో ఇబ్బంది పడుతున్న డిగ్రీ కళాశాలకు ఎట్టకేలకు వసతి లభ్యమయింది. మాడుగుల జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ఆవరణలో డిగ్రీ కళాశాలను గురువారం మధ్యాహ్నం డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కళాశాల విద్యార్థిని రొంగలి నళిని చేత ప్రారంభింపజేశారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన కళాశాల విద్యార్థులతో ముచ్చటించారు. ఈ భవనంలో 30 గదులు వున్నాయి. తరగతి గదులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, జెడ్పీటీసీ సభ్యురాలు కిముడు రమణమ్మ, సర్పంచ్ యడ్ల కళావతి, కళాశాల చైర్మన్ శ్రీనాథు శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు కుక్కర మహేశ్వరి, కళాశాల ప్రిన్సిపాల్ శాస్త్రి, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు పెరుమాళ్ల వెంకట్రావు, మండల కోఆప్షన్ సభ్యురాలు షేక్ ఉన్నీసా, కొట్యాడ భాస్కరరావు, వేమన గణేష్, యడ్ల శ్రీధర్, కుక్కర శ్రీధర్, మోదకొండ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల తరలింపు

రోలుగుంట: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల విద్యాశాఖాధికారి స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో భద్రపరిచిన పాఠ్య, నోట్ పుస్తకాలను ఆయా పాఠశాలలకు పంపించే చర్యలు చేపట్టారు. జె.నాయుడు పాలెం, బుచ్చింపేట, కుసుర్లపూడి, రోలుగుంట క్లస్టర్ల వారీగా పాఠశాలలకు రీసోర్స్‌పర్సన్ల ద్వారా అందజేస్తున్నారు. తమ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు చేరడంపై ఆయా పాఠశాలల హెచ్ఎంలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో తామే ఎమ్మార్సీ భవన్‌కు వెళ్లి వీటిని తెచ్చుకోవాల్సి ఉండేదని ఇప్పుడు నేరుగా తమ వద్దకే పాఠ్య పుస్తకాలు వస్తున్నాయని అన్నారు.

నట్టల నివారణ మందులతో మేలు

కె.కోటపాడు : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 15 రోజుల పాటు గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేసే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.బైరాగి అన్నారు. మండలంలో కింతాడలో గురువారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రతి ఆర్బీకే కేంద్రానికి నట్టల నివారణ మందును ఇప్పటికే సరఫరా చేసినట్లు తెలిపారు. మండలంలో 18 వేల గొర్రెలు, మేకలకు మందు వేయనున్నట్లు తెలిపారు. నట్టల నివారణ మందు వేయడం వలన గొర్రెలు, మేకల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు శివకుమార్, త్రినాథ్, గోపి, సురేష్, ఆర్.సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మరిడిమాంబ పండగ

మాడుగుల: మండలంలోని సత్యవరం గ్రామంలో గ్రామస్తుల సహకారంతో మరిడిమాంబ జాతర గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాటాలు, సంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామస్తులు అమ్మవారి ప్రతిరూపమైన ఘటాలను శిరస్సున పెట్టుకుని కాలినడకన ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

ప్రభుత్వ పాఠశాలలపై ప్రచారం

రోలుగుంట: నాణ్యమైన విద్య, ఉచిత బోధన ప్రభుత్వ పాఠశాలల్లోనే సాధ్యమని కుసుర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం మోహన్‌రావు అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి ప్రచారం చేపట్టారు. దీనిలో భాగంగా గురువారం ఆయన ఉపాధ్యాయులు విద్యావతి, అప్పన రాంబాబు, సాంబశివరావు, భార్గవి తదితరులతో కుసుర్లపూడి, జేపీ అగ్రహారం గ్రామాల్లో ప్రచారం చేశారు. బోధన, పోటీ పరీక్షలకు శిక్షణ, నైపుణ్యం కలిగిన టీచర్లచే బోధన, జగనన్న విద్యాకానుక అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.

వడ్డాదిలో..

బుచ్చెయ్యపేట : బడి బయటి పిల్లలు పాఠశాలల్లో చేరేలా తల్లిదండ్రులు సహకరించాలని జెడ్పీటీసీ దొండా రాంబాబు కోరారు. జన భాగీదారి కార్యక్రమంలో భాగంగా గురువారం మేజర్ పంచాయతీ వడ్డాదిలో ఐసీడీఎస్ సిబ్బంది, స్త్రీ శిశు సంక్షేమశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్య కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని నాడు నేడు పథకంలో అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి విద్యార్థుల ఉన్నతికి కృషి చేస్తున్నారని అన్నారు. సూపర్ వైజర్ రాజరాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు దుర్గ, అమ్మాజీ, ధనలక్ష్మి, వెంకటలక్ష్మి, శివమ్మ, సంతోషి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

దిశ యాప్ ఆడపిల్లలకు రక్షణ కవచం

చోడవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన దిశ యాప్ ఆడపిల్లలకు రక్షణ కవచం లాంటిదని, బటన్ నొక్కిన పది నిమిషాలలో సాయుధ బలగాల రక్షణ లభిస్తుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు అన్నారు. గురువారం కళాశాలలో దిశ యాప్ పట్ల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ మూడు యూనిట్లు, ఉమన్ ఎంపవర్‌మెంట్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చోడవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ దిశ యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని, దీని కారణంగా మీ వ్యక్తిగత సమాచారానికి ఎటువంటి భంగం కలగదని, అపోహలను విడనాడాలని స్పష్టం చేసారు. పలువురు విద్యార్థులచే దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ ఎస్.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్, ఉమన్ ఎంపవర్‌మెంట్ ఆఫీసరు లక్ష్మీమంగమ్మ, ఎస్ఎం కుమారి, ఎన్ఎస్ఎస్ పీవోలు డి.మాల్యాద్రి, ఎస్.మల్లిబాబు, టి.రాధాకృష్ణ, రామలక్ష్మి, కోమలి పాల్గొన్నారు.

నిధుల మంజూరు పట్ల కృతజ్ఞతలు

చీడికాడ: చీడికాడలో నూతనంగా నిర్మించే దుర్గాదేవి ఆలయానికి రూ. 10 లక్షలు మంజూరు అయ్యాయి. ఈ నిధులను తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి మంజూరుకు కృషి చేసిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

జగన్‌బాబుదే మళ్లీ గెలుపు

గడప గడపకు కార్యక్రమంలో ముఖ్యమంత్రికి వృద్ధురాలి ఆశీస్సులు



పాకలపాడులో ఎమ్మెల్యే ఉమాశంకర్‌ను దీవిస్తున్న 108 సంవత్సరాల వృద్ధురాలు

గొలుగొండ: ప్రజలకు నూరుశాతం న్యాయం చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ కచ్చితంగా గెలుస్తారని పాకలపాడు గ్రామంలో 108 సంవత్సరాల వృద్ధురాలు ఆప్యాయంగా దీవించింది. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ ఆధ్వర్యంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ ఘటన చోటు చేసుకుంది. తనకు పిల్లలు లేరని, ఒంటరిగా బతుకుతున్నానని ఆమె తెలిపింది. సీఎం ఇస్తున్న పింఛనుతోనే తాను బతుకుతున్నానని వివరించింది. అనంతరం గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు గురించి ఎమ్మెల్యే వివరించారు. స్థానికులు పలు సమస్యలు తెలిపారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, మండలపార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత, వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి, మండల యూత్‌పార్టీ అధ్యక్షుడు రామకృష్ణనాయుడు, మండల సచివాలయ కన్వీనర్ల సంఘం అధ్యక్షులు పాణీశాంతారామ్, సర్పంచ్ రాజాన పద్మ, ఎంపీటీసీ యాళ్ల లక్ష్మీదుర్గా నాయుడితో పాటు పాకలపాడు గ్రామ నాయకులు యాళ్ల నాయుడు, అప్పలనాయుడు, అల్లు రమేష్, పోలిరెడ్డి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలి



ఆర్ అండ్ బీ శాఖ ఎండీ శ్రీనివాసరెడ్డికి సమస్యలు వివరిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: నియోజకవర్గంలో మరమ్మతులకు గురైన రోడ్లు బాగు చేయాలని కోరుతూ రోడ్లు, భవనాల శాఖ ఎండీ ఎల్. శ్రీనివాసరెడ్డిని కోరినట్లు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ చెప్పారు. విజయవాడలో ఆయనను గురువారం కలిసి నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితిపై వివరించినట్టు ధర్మశ్రీ చెప్పారు. గంధవరం నుంచి కొత్తకోట వరకూ మంజూరైన ఆర్అండ్‌బి రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని, రూ. 112 కోట్ల నిధులు మంజూరైనా రెండేళ్లుగా పనులు చేపట్టడంలో జాప్యం చోటు చేసుకుందని ఆర్అండ్‌బి ఎండీకి వివరించినట్లు తెలిపారు. అదే విధంగా నియోజవర్గంలో సుమారు 13 లింకు రోడ్లు దెబ్బతిన్నాయని, వాటిని వెంటనే మరమ్మతు చేయాలని ప్రతిపాదనలు ఇచ్చామన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు ధర్మశ్రీ తెలిపారు.

శాశ్వత గృహహక్కు పథకంపై అవగాహన

నాతవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన శాశ్వత గృహ హక్కు పథకం ఎంతో ఉపయోగకరమని నర్సీపట్నం డీఎల్‌పీవో ఎస్.ఎస్.వి. మూర్తి అన్నారు. మండలంలో వల్సంపేట, చమ్మచింత, మాధవనగరం, కురువాడ, ఉలమల్ల గ్రామాల్లో పర్యటించి శాశ్వత గృహ హక్కు పథకం మ్యాప్‌లను పరిశీలించారు. ఈ పథకం తాలుకా విధి విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వల్సంపేటలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి సేంద్రియ ఎరువుల తయారీపై కార్యదర్శులు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి పంచాయతీ విస్తరణాధికారి చినబాబు, పంచాయతీ కార్యదర్శి చందు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ సమతుల్యత



కొత్త అగ్రహారం నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న లక్ష్మణ్

కె.కోటపాడు : పర్యావరణ సమతుల్యతకు ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో జి.లక్ష్మణ్ అన్నారు. కె.కోటపాడు మండలంలో గల కొత్త అగ్రహారం, కొత్తూరు, సింగన్నదొరపాలెం, బత్తివానిపాలెం నర్సరీలను గురువారం ఆయన పరిశీలించారు. వేసవిలో మొక్కలు వడలిపోకుండా ప్రతీ రోజూ తడి అందించాలని సూచించారు. అనకాపల్లి జిల్లాలో 47 చోట్ల వన నర్సరీలలో ఆరున్నర లక్షల సరుగుడు, లక్ష టేకు, మూడు లక్షల టాల్ ప్లాంట్ మొక్కలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. రైతులకు వన నర్సరీల ద్వారా మొక్కలు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. మొక్కలు కావాల్సిన రైతులు వన నర్సరీల వద్దకు పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు తీసుకెళ్ళి పొందాలని తెలిపారు. పరిశ్రమలకు కలెక్టర్ నిర్ణయించిన ధరకు మొక్కలు అందిస్తామన్నారు. ఎన్టీపీసీకి చెందిన సీఎస్ఆర్ నిధులతో మొక్కలు పెంచే కార్యక్రమం జరపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రేంజ్ అధికారి బి.చంద్రశేఖర్, డీఆర్‌వో విజయ్‌కుమార్, వనసేవకుడు చిరికి గోవింద తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల చెంతకే ఖరీఫ్ విత్తనాలు



రైతులకు విత్తనాలు అందజేస్తున్న సర్పంచ్ బాబురావు

దేవరాపల్లి: రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్నదాతల చెంతకే విత్తనాలు అందజేస్తున ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, బోయిలకింతాడ సర్పంచ్ బూరె బాబురావు అన్నారు. ఈ మేరకు బోయిలకింతాడ సచివాలయం వద్ద రైతులకు ఖరీఫ్ వరి విత్తనాలను గురువారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ రాయితీపై ప్రభుత్వం అందిస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయ శాఖ సలహా సంఘం చైర్మన్ అన్నం రామునాయుడు, స్థానిక ఆర్బీకే ఇన్‌చార్జి యశోద, అన్నం సాంబమూర్తి, అన్నం వెంకటరావు, అన్నం సత్యారావు, బొబ్బిలి శ్రీను, పడిదెడకల శంకరరావు, గ్రామ సచివాలయ కన్వీనర్లు దాసరి శ్రీను, బొబ్బిలి రాము, రైతులు పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలుకు సత్కారం



సత్కారం పొందిన విద్యార్థులతో ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం:ప్రభుత్వం విద్యారంగంలో తీసుకువచ్చిన సంస్కరణలతో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి ప్రతిభావంతుల సత్కార కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వాలు ఎన్నడూ చేయని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులను మరింత ప్రోత్సహించేందుకు జగనన్న ఆణిముత్యాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హెచ్.వి.జయరాం, మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్లు తమరాన అప్పలనాయుడు, కోనేటి రామకృష్ణ, ఎంపీడీవో జయమాధవి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సంధ్యారాణి, ఎంఈవో సాయిశైలజ, నాలుగు మండలాలా ఎంపీడీవోలు, ఎంఈవోలు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ పండగ

దేవరాపల్లి: మండలంలోని వాకపల్లి, పెదనందిపల్లి గ్రామాల్లో మరిడిమాంబ అమ్మవారి పెద్ద పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారి జాము నుండి ఆలయాలు భక్తులతో కిక్కిరిసాయి. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని తెనుగుపూడిలో ముత్యాలమ్మ తల్లి ఒడ్డు పండగను గ్రామస్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామస్తులంతా ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి పసుపు కుంకుమ సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తెనుగుపూడి ఉప సర్పంచ్ కాటిపాం పెదనాయుడు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.